సాంఘిక బహిష్కరణ కేసులో 15 మందికి జైలుశిక్ష

వినాయక్‌నగర్, జూన్ 3: ఓ కుటుంబాన్ని గ్రామ, సాంఘిక బహిష్కరించిన కేసులో 15 మందికి జైలుశిక్ష విధిస్తూ నిజామాబాద్ రెండో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి శ్రీనివాస్ మంగళవారం తీర్పు వెలువరించారు. కేసుకు సంబంధించిన వివరాలు.. జక్రాన్‌పల్లి మండలం కొలిప్యాక్ గ్రామానికి చెందిన ఆర్లోళ్ల రుక్మవ్వ 2020 ఏప్రిల్ 22 తన భర్త, కుమారుడు, కూలీలతో కలిసి పొలానికి వెళ్లి ట్రాక్టర్‌లో గడ్డి తీసుకుని ఇంటికి వస్తున్నది. అదే గ్రామానికి చెందిన మేకల బబ్లు, మేకల భవాని.. ట్రాక్టర్‌ను ఆపి గడ్డికి అగ్గిపెడుతామని రుక్మవ్వను బెదిరించారు. ఈ విషయంలో గ్రామ జన సంఘం నాయకులు పంచాయితీ పెట్టి రుక్మవ్వకు జరిమాన విధించి, సాంఘిక బహిష్కరణ చేశారు. దీనిపై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా, అప్పటి నిజామాబాద్ ఏసీపీ శ్రీనివాస్ కుమార్ సమగ్ర నేర విచారణ చేపట్టి కోర్టులో అభియోగ పత్రాలను సమర్పించారు. సాక్షులను విచారించిన కోర్టు నేరారోపణలు రుజువుకావడంతో గ్రామ సంఘం సభ్యులు మేకల బబ్లు, మేకల కవిత, గొల్ల బొడ్డు తిరుపతి, ముప్వల పోశన్న, రావుట్ల బక్కన్న, పాపి గంగాధర్, బొడ్డు నవీన్, కలకాడి ముత్తెన్న, మాలచిన్న రాజన్న,బొల్లి రంజిత్, వడ్ల శ్రీకాంత్, దాసరి సురేందర్, ఆరెపల్లి ఇస్తారి, వంకాయల గంగాధర్, తలారి గంగాధర్‌కు మూడేండ్లు, ఐదేం డ్లు జైలు శిక్షతో పాటు నాలుగు, ఐదు వేల రూపాయల జరిమానా విధించారు. ముద్దాయిలు తిరుపతి, బక్కన్న, పాపి గంగాధర్, నవీన్, ముత్తెన్న, రంజిత్, శ్రీకాంత్, ఇస్తారికి ఎస్సీ,ఎస్టీ అత్యాచారాల చట్ట ప్రకారం ఐదేండ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. వెయ్యి జరిమానా విధించారు. శిక్షలన్నీ ఏకకాలంలో అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు.

డిగ్రీ పరీక్షలు ప్రశాంతం

డిచ్‌పల్లి, జూన్ 3: తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా జరిగాయని అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ఆచార్య చంద్రశేఖర్ తెలిపారు. ఉమ్మడి జిల్లా పరిధిలో మొత్తం 32 పరీక్ష కేంద్రాల్లో 3,331 మందికి 2,992 మంది హాజరు కాగా 339 మంది విద్యార్థులకు గైర్హాజరయ్యారని తెలిపారు. ఉదయం నిర్వహించిన 6వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షకు 3,185 మందికి 2,854 మంది హాజరవగా 331 మంది గైర్హాజరయ్యారని, మధ్యాహ్నం జరిగిన మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షకు 146 మందికి 138 మంది హాజరయ్యారని తెలిపారు.

ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు పంపిణీ

మాట్లాడుతున్న పోచారం

రుద్రూర్, జూన్ 3: వర్ని మండల కేంద్రంలోని సీసీడీ కల్యాణ మండపంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో నాలుగు మండలాల లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్ని మండలంలో 425మందికి, చందూర్‌లో 94, మోస్రాలో 96, రుద్రూర్ మండలంలో 188 మంది చొప్పున మొత్తం 803మందికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరైనట్లు తెలిపారు. రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు, ఏఎంసీ చైర్మన్ సురేశ్‌బాబా, రుద్రూర్ మాజీ జడ్పీటీసీ నారోజి గంగారాం, ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళా మెడలో నుంచి గొలుసు చోరీ

వినాయక్‌నగర్, జూన్ 3: వాకిలి ఊడుస్తున్న మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు చోరీకి గురైంది. నగరంలోని ఐదో ఠాణా ఎస్సై గంగాధర్ కథనం ప్రకారం.. నాగారంలోని 300 క్వార్టర్స్, గోశాల సమీపంలో నివసించే సావిత్రి మంగళవారం ఉదయం ఇంటి ముందుర ఊడుస్తున్నది. బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు ఆమె మెడలోని రెండున్నర తులాల బంగారు పుస్తెల తాడు తెంచుకొని పారిపోయారు. కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. నిందితుల ఆనవాళ్లు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయని, నిందితులను త్వరలో పట్టుకుంటామని ఆయన తెలిపారు.

ఆగస్టు 14లోగా భూ సమస్యల పరిష్కారం

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు
- జిల్లావ్యాప్తంగా భూభారతి రెవెన్యూ సదస్సులు ప్రారంభం
- రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించిన అధికారులు

గోవింద్‌పల్లిలో అధికారులు, రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

డిచ్‌పల్లి/ధర్పల్లి/ కోటగిరి/ రుద్రూర్/ పొతంగల్/ జక్రాన్‌పల్లి, జూన్ 3: భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టం అమలులో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సూచించారు. డిచ్‌పల్లి మండలం సుద్దులం, ధర్పల్లి మండలం గోవింద్‌పల్లి గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సుల్లో కలెక్టర్ పాల్గొని రైతులతో మాట్లాడి, వారి సమస్యలు తెలుసుకున్నారు. భూభారతి చట్టంలోని అంశాలను వివరిస్తూ రైతుల సందేహాలను నివృత్తి చేశారు. మెండోరా మండలంలో పైలట్ ప్రాతిపదికన రెవెన్యూ సదస్సులు నిర్వహించి, క్షేత్రస్థాయిలో పరిశీలన పూర్తి చేశామన్నారు. తహసీల్దార్, నాయబ్ తహసీల్దార్ల నేతృత్వంలో రెండు బృందాలను ఏర్పాటు చేసి ప్రతిరోజూ రెండు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆగస్టు 14వ తేదీలోపు భూభారతి కింద వచ్చిన అన్ని అర్జీలను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా రైతు గుర్తింపు కార్డుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ, హెల్ప్ డెస్క్, జనరల్ డెస్క్‌ల వద్ద సదుపాయాలు, సిబ్బంది పని తీరును కలెక్టర్ పరిశీలించిన ఆయన.. అధికారులకు పలు సూచనలు చేశారు. ధర్పల్లి మండలంలోని గోవింద్‌పల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సును కలెక్టర్ తనిఖీ చేశారు. మొదటి రోజు 45దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ శాంత తెలిపారు. కేశారం గ్రామంలో డీటీ ప్రవీణ్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో రాజేంద్రకుమార్, తహసీల్దార్లు సతీశ్‌రెడ్డి, శాంత, రెవెన్యూ అధికారులున్నారు. కోటగిరి మండలం యాద్గార్‌పూర్‌లో డీటీ మధు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించి, రైతుల నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. గిర్దావర్ సయ్యద్ హుస్సేన్, సర్వేరల్ శ్రీనివాస్ రాథోడ్, పంచాయతీ కార్యదర్శి సునంద తదితరులు పాల్గొన్నారు. రుద్రూర్ మండలంలోని సిద్ధాపూర్, బొప్పాపూర్ గ్రామాల్లో తహసీల్దార్ తారాబాయి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. పొతంగల్ మండలంలోని జల్లాపల్లిలో నిర్వహించిన సదస్సుకు బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో హాజరై రైతులతో మాట్లాడారు. రైతులు తమ భూ సమస్యలను లిఖితపూర్వకంగా సమర్పిస్తే గడువులోపు పరిష్కరించనున్నట్లు చెప్పారు. తహసీల్దార్ గంగాధర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. జక్రాన్‌పల్లి మండలం నారాయణపేట్, మనోహరాబాద్ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను తహసీల్దార్ కిరణ్మయి ప్రారంభించారు. ఆర్ఐ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు. సిరికొండ మండలంలోని రావుట్ల, గడ్కోల్ గ్రామాల్లో నిర్వహించిన సదస్సుల్లో తహసీల్దార్ రవీందర్‌రావు, అధికారులు కలిసి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మోర్తాడ్ మండలం వడ్యాట్, కమ్మర్‌పల్లి మండలం నాగాపూర్ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. మోర్తాడ్, కమ్మర్‌పల్లి తహసీల్దార్లు కృష్ణ, ప్రసాద్ రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. మార్కెట్‌కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య తదితరులు పాల్గొన్నారు. ఆర్మూర్ మండలంలోని రాంపూర్ గ్రామంలో తహసీల్దార్ సత్యనారాయణ, మగ్గిడి గ్రామంలో డిప్యూటీ తహసీల్దార్ సుజాత భూభారతిపై అవగాహన కల్పించారు. బోధన్ మండలంలోని నాగన్‌పల్లి, సాలూరా మండలంలోని మందర్న గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. మందర్నలో నిర్వహిస్తున్న సదస్సును బోధన్ సబ్ కలెక్టర్ బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో సందర్శించారు. నాగన్‌పల్లిలో తహసీల్దార్ విఠల్, మందర్నలో తహసీల్దార్ శశిభూషణ్ తదితరులున్నారు. ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్‌లో తహసీల్దార్ మల్లయ్య రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈనెల 4న బాట్టాపూర్, 5న తడపాకల్, 6న గుమ్మిర్యాల్, 9న దోంచంద, 10న తొర్తి, 11న ఏర్గట్లలో సదస్సు నిర్వహిస్తామని తెలిపారు. నవీపేట మండలంలోని యంచలో తహసీల్దార్ వెంకటరమణ పాల్గొని మాట్లాడారు. అనంతరం సమస్యలున్న రైతుల నుంచి దరఖాస్తు స్వీకరించారు. రెవెన్యూ అధికారులు దేవీసింగ్, నరేశ్, రైతులు పాల్గొన్నారు.

ఫర్నిచర్ షాపులో అగ్నిప్రమాదం

ఫర్నిచర్‌ను బయటికి తీస్తున్న స్థానికులు

వినాయక్‌నగర్, జూన్ 3: నగరంలోని కంఠేశ్వర్ బైపాస్ రోడ్డులోని ఓ ఫర్నిచర్ షాపులో సోమవారం అర్ధరాత్రి అనంతరం అగ్నిప్రమాదం సంభవించింది. రాత్రి సమయంలో దుకాణంలో నుంచి భారీ పొగతో మంటలు చెలరేగడాన్ని గమనించిన స్థానికులు.. అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ప్రమాదంలో భారీ నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు.

సంక్షిప్తంగా..

- **నాణ్యమైన విత్తనాలు అందించాలి** - సిరికొండ, జూన్ 3: రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని ఏఐకేఎంఎస్ ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి కరల్‌మార్క్స్ అనారు. గడ్కోల్‌లో కమిటీ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రభుత్వం తెలంగాణ విత్తానాభివృద్ధి సంస్థకు చెల్లించాల్సిన రూ.540కోట్లు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో గులాం హుస్సేన్, ఎల్లన్న, చిన్న గంగాధర్, రాజాగౌడ్, రాజు, జాకీర్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.
- **టేకు దుంగల స్వాధీనం** - సిరికొండ, జూన్ 3: పాకాల– పందిమడుగు సెక్షన్ పరిధిలో అక్రమంగా నిల్వ ఉంచిన టేకు దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు ఎఫ్ఆర్వో రవీందర్ మంగళవారం తెలిపారు. సెక్షన్ పరిధిలోని కంపార్ట్‌మెంట్ నంబర్ 496లో ఉన్న అటవీ ప్రాంతంలో టేకు చెట్లను నరికి 131 దుంగలు ఐదుగురు ఇండ్లలో దాచుకున్నారు. పోలీసుల సహకారంతో సోదా చేసి, దుంగలను సీజ్ చేసినట్లు తెలిపారు.
- **సుద్దులంలో మెగా వైద్య శిబిరం** - డిచ్‌పల్లి, జూన్ 3: సుద్దులం గ్రామంలో క్రిస్టియన్ మెడికల్ కళాశాల, డిచ్‌పల్లి వైద్యశాల ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. క్రిస్టియన్ మెడికల్ కళాశాల సీఈవో సుమంత్ హాజరై శిబిరాన్ని సందర్శించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు, వైద్యులు పాల్గొన్నారు.
- **సీసీ రోడ్డు పనులు ప్రారంభం** - డిచ్‌పల్లి, జూన్ 3: మండలంలోని ధర్మారం (బీ) గ్రామంలో ఎంఎన్ఆర్ఈజీఎస్ ద్వారా చేపట్టే సీసీ రోడ్డు పనులను నాయకులతో కలిసి అధికారులు ప్రారంభించారు. రూ.15లక్షల వ్యయంతో పనులను చేపట్టనున్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.
- **ఆశ్రమానికి నిప్పు** - ఖిలీల్‌వాడి(మోపాల్), జూన్ 3: మోపాల్ మండలంలోని సిర్పూర్ శివారులో అవధూత నిర్మాణానంద స్వామి ఆశ్రమాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ ఆశ్రమానికి గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి నిప్పు పెట్టారు. ఆ భూమి కబ్జా కోసమే ఈ దుశ్చర్యకు పాల్పడినట్లు భక్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మోపాల్ పోలీస్‌స్టేషన్‌లో భక్తుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు.
- **చెరువులో స్నానం చేయడానికి వెళ్లి వ్యక్తి మృతి** - పొతంగల్, జూన్ 3: చెరువులో స్నానం చేయడానికి వెళ్లిన వ్యక్తి నీటిలో మునిగి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పొతంగల్‌కు చెందిన గోపాల్(21) మే 31న పెద్ద చెరువులో స్నానం చేయడానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు నీటిలో మునిగి ఊపిరాడక మృతి చెందాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సునీల్ మంగళవారం తెలిపారు.

సీజనల్ వ్యాధుల నియంత్రణే లక్ష్యంగా పనిచేయాలి

అదనపు కలెక్టర్ అంకిత్

కంఠేశ్వర్, జూన్ 3: సీజనల్ వ్యాధుల నియంత్రణే లక్ష్యంగా అంకితభావంతో కృషి చేయాలని అదనపు కలెక్టర్ అంకిత్ అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని తన చాంబర్‌లో సంబంధిత అధికారులతో అదనపు కలెక్టర్ మంగళవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఎక్కడ కూడా డెంగీ, చికున్ గున్యా, మలేరియా, టైఫాయిడ్, విషజ్వరాలు ప్రబలకుండా క్షేత్రస్థాయిలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోజువారీగా పీహెచ్‌సీల నుంచి సీజనల్ వ్యాధులకు సంబంధించిన కేసుల నమోదు వివరాలను తెప్పించుకుని, ఎక్కడైనా డెంగ్యూ కేసులు నమోదైతే చుట్టుపక్కల అన్ని నివాస గృహాల వద్ద నియంత్రణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల నిర్ధారణ కోసం ప్రజలు ర్యాపిడ్ టెస్ట్‌లు చేయించుకునేందుకు టోల్ ఫ్రీ నంబర్ 9390653962ను సంప్రదించవచ్చని తెలిపారు. సమావేశం లో జడ్పీ సీఈవో సాయాగౌడ్, డీఎంహెచ్‌వో రాజశ్రీ తదితరులు పాల్గొన్నారు.

గ్లోబల్ యూత్ సమ్మిట్‌కు గంగోత్రి

డిచ్‌పల్లి, జూన్ 3: కర్ణాటక రాష్ట్రంలోని మంగుళూర్ మేనేసోయ యూనివర్సిటీలో ఈనెల 5, 6తేదీల్లో నిర్వహించనున్న గ్లోబల్ యూత్ సమ్మిట్–2025కి తెలంగాణ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విద్యార్థిని గంగోత్రి రామగిరి ఎంపికైనట్లు ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య రవీందర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. యూనివర్సిటీ స్థాయిలో కల్చరల్ విభాగంలో గంగోత్రి ప్రాధిక్యాన్ని ప్రదర్శించడంతో గ్లోబల్ యూత్ సమ్మిట్‌కు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమెను వైస్ చాన్స్‌లర్ యాదగిరిరావు, రిజిస్ట్రార్ యాదగిరి, ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం అధికారిణి స్రవంతి అభినందించారు.

కాళేశ్వరంతో సాగునీటి కష్టాలు దూరం చేసిన కేసీఆర్

- జడ్పీ మాజీచైర్మన్ విఠల్‌రావు

సారంగాపూర్, జూన్ 3: కాళేశ్వరంతో పడావు భూములు పచ్చదనంతో వెల్లివిరిసేలా సాగునీటిని అందించిన ఘనత తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌దే అని జడ్పీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి దాదన్నగారి విఠల్‌రావు తెలిపారు. ఆయన మంగళవా రం ఒక ప్రకటన విడుదల చేశారు. కాళేశ్వరంతో రాష్ట్రంలో 35లక్షల ఎకరాల ఆ యకట్టు సాగు విస్తీర్ణం పెరిగిందని పేర్కొన్నారు. దీనిని ఓర్వలేని సీఎం రేవంత్‌రెడ్డి.. కేసీఆర్, మంత్రులు హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌కు నోటీసులు ఇప్పించడం రాజకీయ కుట్ర అని తెలిపారు. నో టీసులు రద్దు చేయాలని, రైతాంగ వ్యతిరేక విధానాలు విడనాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

లీగల్ మెట్రాలజీ వినియోగదారులకు రక్షణగా నిలవాలి

ఖిలీల్‌వాడి, జూన్ 3: లీగల్ మెట్రాలజీ వినియోగదారులకు రక్షణగా నిలవాలని ఇందూరు వినియోగదారుల సంక్షేమ సమితి బాధ్యులు జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారులకు విన్నవించారు. వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి, భారత వినియోగదారుల సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి సందు ప్రవీణ్, ఇందూరు వినియోగదారుల సంక్షేమ సమితి జిల్లా అధ్యక్షుడు పెండోట అనిల్, ఉపాధ్యక్షులు వీఎన్ వర్మ, కార్యదర్శులు గైని రత్నాకర్, మహాదేవుని శ్రీనివాస్, దేవేశ్ లీగల్ మెట్రాలజీ నూతన కార్యాలయాన్ని మంగళవారం సందర్శించారు. లీగల్ మెట్రాలజీ రూల్స్ –2011 పకడ్బందీగా అమలుచేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. కొత్తగా అమలులోకి వస్తున్న లీగల్ మెట్రాలజీ రూల్స్‌పై జూన్ 14 నుంచి అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చక్రపాణి తెలిపారు.

అర్గుల్ జడ్పీహెచ్ఎస్‌కు చెందిన 2000-2001 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థుల సిల్వర్ జూబ్లీ వేడుకలను స్థానిక మైత్రి గార్డెన్‌లో మంగళవారం నిర్వహించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు భాస్కర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, ఎల్. మధుసూదన్, కె.మధుసూదన్, గులాబ్ నబీ ఆజాద్‌ను సన్మానించారు. -జక్రాన్‌పల్లి, జూన్ 3

ప్రభుత్వ పాఠశాలలకు పుస్తకాలు

కమ్మర్‌పల్లిలో పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న ఎంఈవో

మోర్తాడ్, జూన్ 3: ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించిన పాఠ్యపుస్తకాలను కమ్మర్‌పల్లి, మోర్తాడ్ మండలాల విద్యాధికారులు ఆంధ్రయ్య, సమ్మిరెడ్డి మంగళవారం పంపిణీ చేశారు. కమ్మర్‌పల్లిలో కమ్మర్‌పల్లి మండల ప్రభుత్వ పాఠశాలలకు, మోర్తాడ్ ఎమ్మార్సీలో మోర్తాడ్, ఏర్గట్ల మండలాల పాఠశాలలకు సంబంధించిన పాఠ్య పుస్తకాలను హెచ్ఎంలకు అందజేశారు. కార్యక్రమాల్లో హెచ్ఎంలు గంగాధర్, ఎస్ఎన్‌మూర్తి, బంతిలాల్, దేవన్న, రాకేశ్, రాజ్‌కిరణ్, సీఆర్‌పీలు సాయిరాం, అంజయ్య, రాజేశ్, లలిత, రతన్ పాల్గొన్నారు.

దొండకాయ పంట ధ్వంసం

నవీపేట, జూన్3: మండలంలోని సలీం ఫారం గ్రామంలో ఓ రైతుకు చెందిన దొండ కాయ పంటను సోమవారం రాత్రి అదే గ్రామానికి చెందిన గుర్తు తెలియని వ్యక్తి కోసి వేసి ధ్వంసం చేశాడు. రైతు లక్ష్మీనారాయణ(దొరబాబు) తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో తాను దొండకాయ పంటను సాగుచేస్తున్నానని, పంట చేతికి వచ్చిన సమయంలో రూ.లక్ష విలువ చేసే 10 గుంటల దొండకాయ పంటను కొందరు కోసివేసి నేల పాలు చేసినట్లు చెప్పాడు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతు పేర్కొన్నాడు. అదే గ్రామానికి చెందిన వ్యక్తిపై తనకు అనుమానం ఉన్నట్లు చెప్పాడు. సీపీకి సైతం ఫిర్యాదు చేస్తానని బాధిత రైతు పేర్కొన్నాడు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

లక్ష్మణ్ (ఫైల్)

మాక్లూర్, జూన్3: మండలంలోని ముల్లంగి గ్రామానికి చెందిన బూరోల్ల లక్ష్మణ్ మంగళవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఎస్సై రాజశేఖర్ కథనం మేరకు.. బూరోల్ల లక్ష్మణ్ ఉదయం మాదాపూర్ నుంచి ముల్లంగి వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. మాదాపూర్ గ్రామ శివారులో మూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న టిప్పర్ అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. తీవ్ర గాయాలు కావడంతో దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడి కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు టిప్పర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

జవాన్‌కు ఘన స్వాగతం

ఉద్యోగ విరమణ పొందిన జవాన్ గంగప్రసాద్‌కు చందూర్ గ్రామస్తులు మంగళవారం ఘన స్వాగతం పలికారు. స్థానిక హనుమాన్ ఆలయం నుంచి బస్టాండ్ వరకు తిరంగా ర్యాలీతో స్వాగతించారు. 17ఏండ్లు దేశ సేవ చేసినందుకు తనకు గర్వంగా ఉన్నదని ఆయన తెలిపారు. – చందూర్, జూన్ 3

పరిచయమైన కొద్ది సేపటికే ప్రాణం తీశాడు

- మహిళ హత్య కేసులో నిందితుడి అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి

హత్య కేసు వివరాలను వెల్లడిస్తున్న సీఐ శ్రీధర్‌రెడ్డి

బాల్కొండ, జూన్ 3: మద్యం తాగేందుకు వచ్చిన వ్యక్తికి పరిచయమైన మహిళ హత్య కేసును పోలీసులు ఛేదించారు. మహిళ హత్య కేసులో నిందితుడిని అరెస్టు చేశారు. కేసు వివరాలను ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి నందిపేట్ ఎస్సై చిరంజీవితో మంగళవారం బాల్కొండ సర్కిల్ ఆఫీస్‌లో విలేకరులకు వెల్లడించారు. గతనెల 26న నందిపేట్ మండలంలోని శాపూర్‌కు చెందిన సాద సుమలత(42) రైతుఫారం నుంచి అయిలాపూర్ వెళ్లే రోడ్డులోని పంట పొలాల వద్ద హత్యకు గురైంది. మృతురాలి కొడుకు 27న ఇచ్చిన ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు మూడు బృందాలుగా ఏర్పడి గాలింపు చేపట్టారు. అయితే మంగళవారం బాల్కొండ మండలం చిట్టాపూర్ ఎక్స్ రోడ్డు వద్ద రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, నందిపేట్ ఎస్సై చిరంజీవి గుర్తు తెలియని వ్యక్తిని పట్టుకుని విచారించగా అసలు విషయం తెలిసింది. ఆలూర్ మండల కేంద్రానికి చెందిన గొల్ల పెద్ద గంగాధర్ మద్యం తాగేందుకు నందిపేట్ వెళ్లాడు. అక్కడ సుమలత పరిచయమైంది. ఆమెకు మాయమాటలు చెప్పి నమ్మించి తన బైక్‌పై అయిలాపూర్ రోడ్డులోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లాడు. అక్కడ ఇద్దరి మధ్య మాటామాట పెరిగి గొడవకు దారి తీసింది. ఎలాగైనా ఆమెను చంపాలన్న ఉద్దేశంతో ఆమెను కింద పడేసి చీర కొంగుతో గొంతుకు బిగించాడు. ఆమె ప్రతిఘటించగా తనతలకు ఉన్న టవల్‌తో ఊపిరాడకుండా చేసి హత్య చేశాడు. పోలీసులకు దొరకకుండా నిర్మల్ జిల్లాలోని తన బంధువుల వద్ద పని చేసుకునేందుకు వెళ్తుండగా నిందితుడిని పట్టుకున్నట్లు సీఐ వెల్లడించారు. హత్యకు ఉపయోగించిన బైక్, టవల్, సెల్‌ను సీజ్ చేశారు. నిందితుడిని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు. నిందితుడిని పట్టుకునేందుకు చాకచక్యంగా వ్యవహరించిన సీఐ శ్రీధర్‌రెడ్డిని నందిపేట్ ఎస్సై చిరంజీవి, హెడ్ కానిస్టేబుల్ నరేందర్, సుదర్శన్ కానిస్టేబుల్ అనిల్, అంబర్‌సింగ్‌ను ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి అభినందించారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

ఎడపల్లి, జూన్3: మండల కేంద్రంలో రెండు టన్నుల పీడీఎస్ సన్న బియ్యాన్ని మంగళవారం పట్టుకున్నట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు వాహనాల తనిఖీ నిర్వహించగా నంబర్ ప్లేట్ లేని వాహనంలో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ సన్న బియ్యం లభ్యమైనట్లు తెలిపారు. ఆర్మూర్ నుంచి మహారాష్ట్రలోని ధర్మాబాద్ వైపునకు తరలిస్తున్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. వాహనాన్ని ఎడపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించి డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

ఇండ్ల పనులు త్వరగా పూర్తి చేయాలి

భీమ్‌గల్, జూన్ 3: మండలంలోని పురాణీపేట్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను మంగళవారం హౌసింగ్ ఏఈ నిషాంత్ పర్యవేక్షించారు. నిర్మాణ వివరాలను గ్రామ పంచాయతీ కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. ఇండ్ల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. ఆయన వెంట ఇందిరమ్మ కమిటీ సభ్యులు దైడి సురేశ్, తోట శివక్రాంతి, లబ్ధిదారులు తదితరులు ఉన్నారు.

రైతులకు విత్తనాల పంపిణీ

మోర్తాడ్‌లో రైతులకు విత్తనాలను అందజేస్తున్న వ్యవసాయఅధికారులు

నమస్తే తెలంగాణ యంత్రాంగం, జూన్ 3: జిల్లావ్యాప్తంగా పలు మండలాల్లో 'నాణ్యమైన విత్తనం – రైతు నేస్తం' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు విత్తన బస్తాలను అందజేశారు. జక్రాన్‌పల్లి రైతువేదికలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రాంతీయ చెరుకు, వరి పరిశోధన స్థానం అధిపతి టి. అంజయ్య, వ్యవసాయ విశ్వవిద్యాలయం సలహ